క్లుప్తంగా

ఇద్దరి బైండోవర్

ఐనవోలు: మండలంలోని పంథిని శివారు జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న నల్లమారెమ్మ వాగుకు ఇరిగేషన్, రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులు సోమవారం సంయుక్తంగా మార్కింగ్ చేసి హద్దులు ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఇద్దరు భూయజమానులు కరిముక్ల విక్రమ్‌రావు, మెరుగు రమేష్‌లు వాగులోకి ఎంక్రోచ్ అయినట్లుగా గుర్తించారు. రెండు రోజుల్లో ఆ ప్రాంతంలో మట్టి తొలగించి అంతా చదును చేసి వాగుకు ఆటంకం లేకుండా చేయాలని అధికారులు సూచించారు. దీంతో సదరు భూ యజమానులు జేసీబీలతో చదును చేస్తున్న క్రమంలో గొడవకు దిగారు. 100 డయల్ రాగా ఎస్సై పస్తం శ్రీనివాస్ ఘటనా స్థలానికి వెళ్లి ఇద్దరిని అదుపులోకి తీసుకుని తహసీల్దార్ విక్రమ్‌కుమార్ ఎదుట రూ.5 లక్షలకు బైండోవర్ చేశారు. మరోసారి గొడవకు దిగి పనులు కాకుండా అడ్డుపడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

పేదల పక్షాన ఉద్యమించిన నేత ఓంకార్



శాయంపేట : నిరుపేదల పక్షాన ఉద్యమించిన నేత ఎంసీపీఐ(యూ) వ్యవస్థాపకుడు మాజీ ఎమ్మెల్యే మద్దికాయల ఓంకార్ అని ఆ పార్టీ మండల కార్యదర్శి ఎండీ. ఉస్మాన్ అన్నారు. మండలంలోని వసంతాపూర్ గ్రామంలో బుధవారం ఓంకార్ 16వ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఓంకార్ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎండీ అష్రఫ్, మొగిలి, రాజేందర్, రాజిరెడ్డి, కిషన్, భుజంగరావు పాల్గొన్నారు.

పరామర్శ



శాయంపేట : మండల కేంద్రానికి చెందిన మారెపల్లి వజ్రమ్మ అనారోగ్యంతో బుధవారం మృతి చెందగా పరకాల ఏఎంసీ వైస్ చైర్మన్ మారెపల్లి రవీందర్ సందర్శించి ఆమె భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు కట్టయ్య, సీనియర్ నాయకులు మార్కండేయ ఉన్నారు.

బీఆర్ఎస్ నాయకుల సంబురాలు



శాయంపేట : తెలంగాణ రాష్ట్రంలో ప్రతిపక్ష హోదాలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ రూ.18,500 కోట్ల విద్యుత్ భారాన్ని ఆపడంలో విజయం సాధించడంతో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు బుధవారం భూపాలపల్లిలో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన నియోజకవర్గ సంబురాల్లో పార్టీ మండల నాయకులు పాల్గొన్నారు. బాణసంచా కాల్చి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి పనులను వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తిరుపతి రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు



ఆత్మకూరు: రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలైన సంఘటన మండలకేంద్రం స మీపంలోని పీర్‌బాబా దర్గా సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ములుగు జిల్లా కమలాపూర్‌కు చెందిన టాటా మ్యాజిక్ డ్రైవర్ లక్ష్మణ్ ములుగురోడ్డులో ప్రయాణికులతో బయలుదేరి ములుగు వైపు వెళ్తుండగా ఆత్మకూరు శివారులో దర్గా వద్ద లారీని తప్పించబోయి ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహన వాహనాన్ని ఢీకొట్టి టాటామ్యాజిక్ వాహనం బోల్తాపడింది. ఈ ఘటనలో టాటా మ్యాజిక్ డ్రైవర్ లక్ష్మణ్, ద్విచక్రవాహనదారుడు రాజకొమురయ్యకు తీవ్ర గాయాలు కాగా టాటామ్యాజిక్‌లో ప్రయాణిస్తున్న పలువురికి గాయాలయ్యాయి. గాయాలైన వారిని 108 సిబ్బంది వాహనంలో ఎంజీఎం తరలించారు. ఆత్మకూరు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

దేదీప్యమానం.. నవనాగ క్షేత్రం

- తెలుగు రాష్ట్రాల్లో ఏకైక ఆలయం
- కాలసర్ప దోషాలకు ప్రత్యేక పూజలు
- పెరిగిన భక్తుల రద్దీ



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు (ఫైల్)

ధర్మసాగర్: దేదీప్యమానంగా నవనాగ క్షేత్రం వెలుగొందుతోంది. మండలంలోని క్యాతంపల్లి శివారు (కేశవనగర్)లో కొన్నేళ్ల క్రితం గంటా సీతారామారావు రాధాదేవి ఆధ్వర్యంలో ఓషదీశ్వర మానసాదేవీ సమేత నవనాగ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడా లేని విధంగా నిర్మించారు. ఈ ఆలయంలో వల్లీ దేవసేన, మానసాదేవి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, నవనాగులను ప్రతిష్ఠించి నిత్య పూజలు చేస్తున్నారు. దీంతో కాలసర్ప, తదితర దోషాలు ఉన్న ప్రజలు నిత్యం ఈ ఆలయానికి వచ్చి పూజలు చేసుకుంటున్నారు.

సుబ్రహ్మణ్యస్వామి విశిష్టత

నిర్గుణమైన పరబ్రహ్మతత్వము, సుగుణముగా బాలుడి రూపంలో అవతరించిన కారణంగా సుబ్రహ్మణ్యేరుడని పేరు వచ్చింది. ఈశ్వరుని తేజస్సు అగ్నిహోత్రుడు, రెల్లు పొదలో నిక్షిప్తం చేసిన సందర్భమున ఒక మహావీరుడు ఉదయించెను. షట్ కృత్తికలు ఆ పిల్లవాడిని పెంచి పెద్ద చేయగా ఆ బాలుడు ఆరు ముఖముల షణ్ముఖుడిగా పేరొందెను. అతడు గౌరీ శంకరుల పుత్రుడగుట వలన కార్తికేయుడని, కుమారస్వామి అని ఉదర గ్రహ్వలములో అన్ని విద్యలు ఇమిడి ఉన్న కారణమున గుహుండని పేరు గలదు. సుబ్రహ్మణ్యేశ్వరుడు ఆరు ముఖములు 12 చేతులు కలవాడనియు కొన్ని గ్రంథాల్లో స్వామి సర్ప స్వరూపుడని పురాణాల్లో అభివర్ణించారు.

మానసాదేవి

ఈమె సర్పలోక ఆదిదేవత ఈమె సర్పమండల యందు మధ్య భాగమందు ఉండును. భూమిలోపలి భాగంలో ఉండే పాతాళ లోకాన్నే నాగలోకం అని పిలుస్తుంటారు. ఈ లోకంలో ఉండే సమస్త నాగ జాతికి తల్లిగా నాగేశ్వరిని అని గుర్తిస్తారు. ఈమెకు మానసాదేవి అని, విషహరి అని పేర్లు ఉన్నాయి. మానసాదేవి కొన్ని సర్పాలను తన ఆభరణాలుగా



సుబ్రహ్మణ్యేశ్వరస్వామి



మానసాదేవి అమ్మవారు

ధరిస్తుంది. ఒక తెల్లటి హంస ఈమెకు వాహనంగా ఉంటుంది. ఒకప్పుడు ఈ భూమి మీద ఉండే భయంకరమైన విషసర్పాలు తరచుగా మానవుల్ని కాటువేస్తూ చంపుతూ ఉండేవి. ఆ పరిస్థితుల్లో కస్యప ప్రజాపతి మానవుల్ని రక్షించడం కోసం, తమ ఇష్టం వచ్చినట్టు ప్రవర్తిస్తున్న సర్పాలను నియంత్రించటం కోసం ఒక మహాశక్తిని తన మనస్సు నుంచి సృష్టించాడు.

కాలసర్ప శాంతి పూజ

పవిత్రమైన నదిలో స్నానం చేసి ఆ తర్వాత ఒక పవిత్ర దేవాలయ ప్రదేశంలో సర్పశాంతి యాగ పూజను చేయించుకోవాలి. అనంతరం మృత్యుంజయ హోమాన్ని జరిపించాలి గతజన్మ కర్మలకు కారణంగా సంక్రమించిన ఈ సర్పదోషాన్ని తొలగించుకోవడం వల్ల మనస్సు, శరీరము శుద్ధమవుతాయి. కాలసర్పదోష నివారణకు శాస్త్రీయంగా కొన్ని పూజలు నిర్వహించి తరువాత పండితులకు దానధర్మాలు చేయాలి. మానసాదేవి సమేత నవనాగ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవాలయంలో నిత్యం పూజలు నిర్వహిస్తున్నారు. ఇక్కడ పూజలు చేసుకుంటే దోషాలు నివారింపబడుతున్నాయని భక్తుల నమ్మకం.

కార్మిక చట్టాలను కాలరాస్తున్న కేంద్రం



ర్యాలీ నిర్వహిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

- ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ధర్మల రామ్మూర్తి
- ఘనంగా ఏఐటీయూసీ 105వ ఆవిర్భావ దినోత్సవం

పరకాల: అనేక ఉద్యమాలతో గత ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకొచ్చి కార్మిక చట్టాలను అమలులోకి తీసుకు రాగా నేడు కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తుందని ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ధర్మల రామ్మూర్తి ఆందోళన వ్యక్తం చేశారు. కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. ఏఐటీయూసీ 105 ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పరకాల వ్యవసాయ మార్కెట్ యార్డులో ర్యాలీ అనంతరం గేట్ వద్ద ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ధర్మల రాంమూర్తి మాట్లాడుతూ నాడు కొట్లాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు కోట్లుగా విభజించి కార్మికుల శ్రమ దోపిడీకి కేంద్ర ప్రభుత్వం పాల్పడుతుందన్నారు. కార్మికుల హక్కులను కాపాడటంలో ఏఐటీయూసీ ముందుంటుందని స్పష్టం చేశారు. పెరుగుతున్న ధరలకు అనుకూలంగా కార్మికులకు రక్షణ కల్పించే విధంగా పని భద్రత కల్పించే విధంగా వేతనాలు పెంచాల్సిన అవసరం ఉందని డిమాండ్ చేశారు. లేని పక్షంలో దేశవ్యాప్త ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ సీనియర్ నాయకుడు ఇల్లందుల రాములు, డివిజన్ అధ్యక్షుడు లంకదాసరి అశోక్, ప్రధాన కార్యదర్శి నాగెల్లి శంకర్, ఉపాధ్యక్షుడు యాదగిరి, కోశాధికారి శ్రీపతి రాజయ్య, రాజేశ్వర్, ముతామేస్త్రీ ఐలయ్య, యాదగిరి శంకర్, రాజయ్య, భద్రయ్య, రవి, తిరుపతి, ఎల్లమ్మ, సుందరమ్మ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి

వేలేరు : వరి కోతలు ప్రారంభమై రోజులు గడుస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను మండలంలో ప్రారంభించడం లేదని ఎమ్మెల్యే కడియం శ్రీహరి, అధికారులు వెంటనే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని బీఆర్ఎస్ పార్టీ మండల కో ఆర్డినేటర్ గోవింద సురేశ్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గతంలో సీఎం కేసీఆర్ ప్రభుత్వ హయాంలో పక్కా ప్రణాళికతో రైతులు పండించిన వరి ధాన్యాన్ని ఐకేపీ కేంద్రాల్లో ఇప్పటి వరకే కొనుగోలు ప్రారంభించారన్నారు. కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు, తాగునీరు, తేమ యంత్రాలు, అవసరమైన మేర ప్యాడీ క్లీనర్లు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న డీబీఎస్ జిల్లా అధ్యక్షుడు సురేశ్

కమలాపూర్: భారత రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాలపై దళితులు, మహిళల రక్షణ కోసం ఏర్పడ్డ చట్టాలపై మహిళలు, ప్రజలు అవగాహన కలిగి ఉండాలని దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎస్) జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్ సూచించారు. మండలంలోని నేరెళ్లలో బుధవారం జరిగిన పౌర హక్కుల దినోత్సవంలో ఆయన మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చిన ఈ 75 ఏళ్లలో దళితుల రక్షణ కోసం అనేక చట్టాలు రూపొందించినప్పటికీ నేటికి అనేక చోట్ల దళితులపై దాడులు, దౌర్జన్యాలు, హత్యలు, అత్యాచారాలు, వివక్షత కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. నిందితులకు సహకరిస్తూ కొందరు పోలీసు అధికారులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని నీరు గారుస్తున్నారని, స్టేషన్ బెయిల్ ఇవ్వకుండా బాధితులకు సత్వర న్యాయం అందించి సకాలంలో పరిహారం అందజేయాలన్నారు. తహసీల్దార్ సురేశ్ మాట్లాడుతూ దళితులు ఎదుర్కొంటున్న సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో గిర్దావర్ సమ్మయ్య, పంచాయతీ కార్యదర్శి విజయ్‌కుమార్, జూనియర్, ఫీల్డ్ అసిస్టెంట్లుటి నర్సయ్య, శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు పంథిని విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈఓ ఆనందం



విద్యార్థులకు నగదు అందజేస్తున్న ఎస్సై శ్రీనివాస్

ఐనవోలు: రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ హాకీ పోటీలకు మండలంలోని పంథినిలోని జెడ్పీహెచ్ఎస్‌లో చదువుతున్న విద్యార్థులు ఎంపికైనట్లు ఎంఈఓ, హెచ్ఎం పులి ఆనందం తెలిపారు. మంగళవారం జిల్లాస్థాయి హాకీ పోటీలు హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో జరుగగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు అండర్ 17 విభాగంలో లకావత్ కార్తీక్, అండర్ 14 విభాగంలో కొలిపాక ఆర్యవీర్, మేకల కార్తీక్‌లు అదే విదంగా బాలికల విభాగంలో సట్ల భవశ్రీ, బుల్లె ప్రసన్నలు ఎంపికైనట్లు చెప్పారు. క్రీడాకారులను బుధవారం ఎంఈఓ పులి ఆనందం, పీడీ కిరణ్, ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యార్థులకు నగదు పురస్కారం అందజేత

మండలంలోని సింగారం జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి థియేటర్ మైమ్ విభాగంలో రాష్ట్రస్థాయి కళాఉత్సవ్ పోటీలకు ఎంపికైన విషయం తెలిసిందే. నవంబర్ 1, 2 తేదీల్లో హైదరాబాద్‌లో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనడానికి విద్యార్థులు ఎండీ రహమాన్, జీ.రాంచరణ్, కె. విశాల్, కె.రిత్విక్, జి.శశాంక్‌లు హైదరాబాద్‌కు వెళ్తున్నారు. కాగా వీరిని బుధవారం మండలంలోని సింగారం ప్రభుత్వ పాఠశాలలో ఎస్సై పస్తం శ్రీనివాస్ అభినందనలు తెలిపి రూ.5వేల నగదు పురస్కారాన్ని అందజేశారు. ట్రావెలింగ్‌కు వినియోగించుకోవాలని సూచించారు. అదే విధంగా జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్ఎం మధుసూదన్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మంత్రి పొన్నం చిత్రపటానికి క్షీరాభిషేకం

ఎల్కతుర్తి : హుస్నాబాద్‌లోని వంద పడకల ఆస్పత్రిని 250 పడకల ఆస్పత్రిగా మారుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం స్థానిక బస్టాండ్ సమీపం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 200ల పడకల ఆస్పత్రిగా మార్చడానికి రూ. 82 కోట్లు విడుదల చేసి దీపావళి కానుకగా హుస్నాబాద్ ప్రజలకు కార్పొరేట్‌కు ధీటుగా ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లకుండా సామాన్య ప్రజలకు వైద్యం అందుబాటులో ఉండే విధంగా నిధులు విడుదల చేయడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, నాయకులు సుకినె సంతాజీ, గౌరై మహేందర్, బత్తిని వెంకటేష్, అంబాల రమేష్, సారయ్య, శనిగరం వెంకటేష్, ప్రభాకర్, ప్రకాష్, వినయ్, వెంకట్, సాహు తదితరులు పాల్గొన్నారు.



మంత్రి ప్రభాకర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న నేతలు

దళారులను ఆశ్రయించొద్దు

ఎల్కతుర్తి : రైతులు దళారులను ఆశ్రయించకుండా నేరుగా బ్యాంకు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకువచ్చి ప్రభుత్వ కల్పించే మద్దతు ధర పొందాలని సింగిల్‌విండో చైర్మన్ రవీందర్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని విశాల సహకార సంఘం ఆధ్వర్యంలో మండలంలోని తిమ్మాపూర్, కేశవాపూర్, బావుపేట, దామెర, చింతలపల్లి, కోతులనడుమ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. 'ఏ' గ్రేడ్ రకానికి రూ.2320, కామన్ రకానికి రూ.2300లు మద్దతు ధర కల్పించిందన్నారు. నోడల్ ఆఫీసర్ ఎండీ.అబ్జల్, ఏఓ రాజ్‌కుమార్, సింగిల్‌విండో వైస్ చైర్మన్ శేషగిరి, బ్యాంకు సీఈఓ తిరుపతి, మాజీ ఎంపీపీ స్వప్న, మాజీ వైస్ ఎంపీపీ తంగెడ నగేష్, ఇంద్రసేనారెడ్డి పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రవీందర్‌గౌడ్

సమగ్ర సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

సాక్షి, నెట్‌వర్క్ : నవంబర్ 1 నుంచి ప్రారంభమయ్యే సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే) పకడ్బందీగా నిర్వహించాలని పలువురు వక్తలు అన్నారు. కమలాపూర్, దామెర, శాయంపేట,ఐనవోలు, వేలేరు మండల కేంద్రాల్లోని రైతు వేదికలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే చేయనున్న ఎన్యుమరేటర్లకు బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రాష్ట్రంలోని షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, వెనుకబడిన తరగతులు, ఇతర బలహీన వర్గాల అభ్యున్నతి కోసం వివిధ సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ అవకాశాలను మెరుగుపర్చడానికి తగిన ప్రణాళికలు తయారు చేయడం, వాటిని అమలు చేయడం ఈ సర్వే ముఖ్య ఉద్దేశ్యమన్నారు. సర్వేలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పారదర్శకంగా సర్వే నిర్వహించాలని సూచించారు. అనంతరం శిక్షకులు ఎన్యుమరేటర్లకు సమగ్ర సర్వే విధి, విధానాలను వివరించి ప్రొజెక్టర్ ద్వారా అవగాహన కల్పించి శిక్షణనిచ్చారు. కార్యక్రమాల్లో బీసీ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్, కమలాపూర్ మండల ప్రత్యేకాధికారి రాంరెడ్డి, ఎంపీడీఓలు గుండె బాబు, ఎంపీఓ రవి, ఏఎస్ఓ కిరణ్, ఏపీఎం నారాయణ, ఎంపీఓలు రమేష్, రంగాచారి, రంజిత్‌కుమార్, రఘుపతి, విమల, భారతి, జగన్, గంగా జమున,జ్యోతి, ఆయా గ్రామాల ప్రత్యేక అధికారులు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.



కమలాపూర్: మాట్లాడుతున్న బీసీ సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్, మండల ప్రత్యేకాధికారి రాంరెడ్డి




దామెర : సర్వేపై శిక్షణ ఇస్తున్న రిసోర్స్‌పర్సన్



శాయంపేట : సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ నారాయణ



ఐనవోలు: మాట్లాడుతున్న ఎంపీడీఓ పులి వెంకటేశ్వర్లు



వేలేరు : మాట్లాడుతున్న ఎంపీడీఓ లక్ష్మీప్రసన్న

కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో..

జేఎల్ ఉద్యోగం సాధించిన భావన



భావన

కమలాపూర్: మండలంలోని శ్రీరాములపల్లికి చెందిన గుండేటి భావన ఈ నెల 28న టీఎస్‌పీఎస్సీ విడుదల చేసిన జూనియర్ లెక్చరర్ ఫలితాల్లో కెమిస్ట్రీ విభాగంలో ఉద్యోగం సాధించింది. శ్రీరాములపల్లికి చెందిన గుండేటి కుమార్-స్వర్ణలత దంపతుల కూతురు భావన ఎమ్మెస్సీ కెమిస్ట్రీ పూర్తి చేసింది. 2023లో శ్రీరాములపల్లి గ్రామానికి చెందిన వెల్దండి భగవాన్‌తో భావన వివాహం జరిగింది. కెమిస్ట్రీ విభాగంలో ఉద్యోగం సాధించి తన తండ్రి కల సాకారం చేయడంతో పాటు పుట్టింటికి, మెట్టింటికి పేరు తెచ్చింది. ఈ సందర్భంగా భావన మాట్లాడుతూ తను ఈ ఉద్యోగం సాధించడానికి తల్లిదండ్రులు, అత్తమామలు, భర్త ప్రోత్సాహం, కుటుంబ సభ్యుల సహకారమే కారణమని తెలిపింది. భావనను కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అభినందించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

విద్యారణ్యపురి: విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేసేవరకు పోరాడాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ పిలుపునిచ్చారు. హనుమకొండలోని ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో విద్యారంగ సమస్యలు ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉందన్నారు. పదేళ్లపాటు విద్యారంగాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం భ్రష్టు పట్టించిందని విమర్శించారు. అధికారంలోనికి కాంగ్రెస్ వచ్చాక కూడా సమస్యలను పరిష్కరించడం లేదని వాపోయారు.